క్లుప్తంగా

సబ్‌కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ హెల్త్ ఆఫీసర్



సబ్‌కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సందీప్‌కుమార్

ఆదోని రూరల్: ఆదోని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌గా డాక్టర్ సందీప్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన మర్యాదపూర్వకంగా సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆదోని మున్సిపల్ పరిధిలో శానిటేషన్, ప్రజారోగ్యం, ఇతర కీలక సమస్యలపై సమగ్రంగా చర్చించారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే సాయం

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు కల్లుబావి ప్రకాష్‌నగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మహాదేవ తండ్రి ఎస్.సంజప్ప(75) సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి సంజప్ప మృతి పట్ల సంతాపం తెలియజేశారు. మట్టి ఖర్చులకు రూ.10 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. పార్టీ నాయకులు స్వామిదాస్, బాషా తదితరులు సంజప్ప మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఉరుకుందలో ప్రత్యేక పూజలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు.

చలివేంద్రం ఏర్పాటు



అంగన్‌వాడీ కేంద్రంలో చలివేంద్రం ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు అరుణ, నరసప్ప

కోసిగి: వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. సోమవారం మండల కేంద్రం కోసిగిలోని హిందు గర్ల్స్ ప్రాథమిక పాఠశాల సమీపంలో 5వ అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయులు అరుణ, నరసప్ప చేతుల మీదుగా చలివేంద్రం ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులు, చిన్నారులను దృష్టిలో ఉంచుకుని చలివేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త హెప్సిబారాణి, ఆశా వర్కర్లు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దకడబూరు : మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ముస్లింలకు వైఎస్సార్ సీపీ నాయకుడు సాయికిరణ్ రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామంలో ప్రత్యేక నమాజు ముగిసిన తర్వాత గ్రామ సర్పంచ్ దస్తగిరి, మండల జనరల్ కార్యదర్శి పెద్ద దస్తగిరి, వరస్వామిలతో కలిసి ముస్లింలకు విందు ఇచ్చారు.

ముగిసిన శిక్షణ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఫార్మసీ కాలేజీలో నెల్లూరు ఫార్మస్యూటికల్ సైన్సెస్‌లో రైజ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఫార్మసీ కోవిజిలెన్స్, క్లినికల్ రీసెర్చ్‌పై జరిగిన శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ.ఉమర్, ప్రొఫెసర్ హెచ్‌ఎం సౌజన్య, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాగీష్ మాట్లాడుతూ శిక్షణలో విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకున్నారని చెప్పారు.

నాగరాజు ఎన్నికపై హర్షం

ఆదోని రూరల్: అఖిల భారత రైతు–కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఆదోనికి చెందిన కె.నాగరాజు ఎన్నిక పట్ల ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సత్యన్న హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21, 22, 23వ తేదీల్లో మహారాష్ట్రలోని నాందేడ్ పట్టణంలో అఖిల భారత రైతు–కూలీ సంఘం 3వ జాతీయ మహాసభలు జరిగాయన్నారు. మహా సభల్లో జాతీయ కార్యవర్గ సభ్యుడిగా కె.నాగరాజును ఎన్నుకోవడం జరిగిందన్నారు.

హామీకి గ్యారంటీ లేదు..

భృతి ఊసే లేదు!

- నిరుద్యోగులకు ఉపాధి లేదా భృతి ఇస్తామని ఎన్నికల్లో కూటమి హామీ
- అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా ఊసే ఎత్తని వైనం
- అదిగో.. ఇదిగో డీఎస్సీ అంటూ.. కాలయాపన
- యువతకు భారంగా మారిన కోచింగ్‌లు



బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ పోస్టర్

ఆదోని సెంట్రల్: ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలో భాగంగా మొట్ట మొదటి హామీ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని లేదా నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్న ఉద్యోగాలు భర్తీ చేయలేదు. అలాగే నిరుద్యోగ భృతి గురించి చర్చలేదు. రాష్ట్ర బడ్జెట్లో కేటాయింపులు కూడా జరగక పోవడం పట్ల నిరుద్యోగ యువత మండి పడుతున్నారు. అధికారంలోకి రాక మునుము ఒక మాట.. అధికారం వచ్చిన తర్వాత ఒక మాట మాట్లాడడంపై సర్వత్రా విమర్శలు వినబడుతున్నాయి.

30వేలకు పైగా నిరుద్యోగుల ఎదురు చూపులు..

ఆదోని నియోజకవర్గంలో దాదాపు 30వేలకు పైగా నిరుద్యోగ యువతీ, యువకులు ఉన్నారు. కూటమి నాయకులు ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాల్లో మొట్ట మొదటి హామీ నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ. 3000లు నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించడంతో పాటు ఇంటికో ఉద్యోగం, ఏడాదికి 2లక్షల ఉద్యోగాలు, 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారు. ఉద్యోగం ఇవ్వలేక పోతే రూ. 3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ప్రచారం హోరెత్తించారు. తీరా గెలిచి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల ప్రస్తావనే ఎత్తడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఉపాధి అవకాశాలు లేవు, నిరుద్యోగ భృతి లేదు. 2014లో నమ్మి మోసపోయినట్లు ఇప్పుడు కూడా మోసపోతున్నామని నిరుద్యోగ యువత మదనపడుతున్నారు.

డబ్బు వెచ్చించి కోచింగ్

కూటమి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తుందనే ఆశతో పట్టణ, గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత డబ్బులు వెచ్చించి ఆదోని, కర్నూలు, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లోని కోచింగ్ సెంటర్లలో కోచింగ్ తీసుకుంటున్నారు. నెలలు గడుస్తున్నా జాబ్ క్యాలెండర్ ప్రకటించక పోవడంతో కోచింగ్ కొనసాగించడం పేద, మధ్యతరగతి నిరుపేద యువకులకు భారంగా మారింది. కొంతమంది అప్పులు చేసి మరీ కోచింగ్ తీసుకుంటున్నారు. జాబ్ క్యాలెండర్ ఇస్తారో ఇవ్వరో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డీఎస్సీపై తొలిసంతకం అని సంతకం చేసి నెలలు గడుస్తున్నా ఇంతవరకు నోటిఫికేషన్ జారీ చేయలేదు. అదిగో... ఇదిగో నోటిఫికేషన్ అంటూ సోషల్ మిడియాలో అసెంబ్లీ, సమావేశాల్లో చెబుతూ నిరుద్యోగ యువతను మభ్య పెడుతున్నారే కానీ, నోటిఫికేషన్ మాత్రం విడుదల చేయడం లేదని యువత విమర్శిస్తున్నారు.

నిరుద్యోగ భృతి మాటే లేదు



నేను బీకాం పూర్తి చేసి నాలుగేళ్లయ్యింది. ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదు. ఉపాధి అవకాశాలు లేకపోవడం, కుటుంబ పరిస్థితి సరిగా లేకపోవడంతో ఓ షాపులో పనిచేస్తున్నా. చదువుకున్న ప్రతి ఒక్కరికీ నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారు. ఇప్పటి వరకు దానికి సంబంధించిన ప్రణాళికలు గానీ, చర్చలు గానీ జరగలేదు. రాష్ట్ర బడ్జెట్లో నిరుద్యోగ భృతికి కేటాయింపులే చేయలేదు. దీంతో భృతి ఇస్తారో ఇవ్వరో తెలియని పరిస్థితి నెలకొంది. ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించాలి.

– ఉమేష్, ఆదోని

జాబ్ క్యాలెండర్ మరిచారు



నేను 2020లో బీటెక్ పూర్తి చేశాను. కాంపిటీటివ్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా. అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటన చేస్తామని చెప్పిన కూటమి నాయకులు ఇంతవరకూ జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదు. ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తారని నాలాంటి ఎంతోమంది నిరుద్యోగులు ఆశతో ఎదురు చూస్తున్నారు. చాలా మంది డబ్బులు వెచ్చించి కోచింగ్‌లు తీసుకుంటున్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకంలో ఇచ్చిన మొట్ట మొదటి హామీపై ఇంత వరకు ప్రభుత్వం స్పందించడం లేదు. జాబ్ ఇవ్వక పోతే నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. దానిపై సరైన స్పష్టత ఇవ్వడం లేదు. ఇప్పటికైన ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు చర్యలు చేపట్టాలి.

– విజయ చౌదరి, ఆదోని

28న జాబ్‌మేళా

ఆదోని రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదోనిలోని టీచర్స్ కాలనీ ఎంపీయూపీ స్కూల్ 2వ బ్లాక్‌లో ఈనెల 28వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా అధికారి ఎల్.ఆనంద్‌రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలలో బహుళ జాతీయ కంపెనీలైన అమర్‌రాజా గ్రూప్, అమిటి మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్, పేటీఎం కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన నిరుద్యోగులు జాబ్‌మేళాలో పాల్గొని నైపుణ్యాలను ప్రదర్శించాలన్నారు. ఎంపికైన వారికి రూ.12 వేల నుంచి రూ.16 వేల వరకు వేతనాలు ఉంటాయన్నారు. వివరాలకు సెల్ 91774 13642, 99854 96587 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

అంబేడ్కర్ జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

ఆదోని రూరల్: ఆదోనిలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వమే నిర్వహించాలని అంబేడ్కర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జైభీమ్ సాయిరామ్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆదోని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఉన్న ప్రహరీలకు పేయింటింగ్ వేయించి, చుట్టుపక్కల ఉన్న పండ్ల బండ్లను తీయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మల బాలస్వామి, నరేష్‌కుమార్, నకులరాజ్, లక్ష్మికాంత్, మల్లికార్జున, రాముడు, వెంకటరాముడు, ఈరన్న, వీరేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



ప్రజా సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కరించడమే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమం లక్ష్యమని, కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించి డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణుసూర్య, డీఎల్‌పీఓ నూర్జహాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సబ్‌కలెక్టర్ సమీక్షా సమావేశం

ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం డివిజన్‌లోని తహసీల్దార్, ఉప తహసీల్దార్, రీ సర్వే ఉప తహసీల్దార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్, మండల సర్వేయర్స్, అధికారులతో రీ సర్వే, గ్రామసభ, రెవెన్యూ సదస్సులపై సమీక్షా సమావేశం జరిగింది. రీ సర్వేలో ఎలాంటి తప్పిదాలు లేకుండా బాధితులకు న్యాయం చేయాలన్నారు.

మెడికల్ కళాశాల పనులు త్వరగా పూర్తి చేయాలి

ఆదోని అర్బన్: ప్రభుత్వం చొరవ చూపి మెడికల్ కళాశాల పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఏపీ రీజనల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ కేవీఎస్ ప్రసాద్, నాబార్డు మరియు కర్నూలు ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (డీడీ) ఎం.సుబ్బారెడ్డి సూచించారు. ఆదోని పట్టణంలోని బైచిగేరి గ్రామ సమీపంలో రూ.312 కోట్ల నిధులతో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల, ఆసుపత్రి నిర్మాణ పనులను సోమవారం వారు సందర్శించారు. వారు మాట్లాడుతూ.. ఆర్‌ఐడీఎఫ్ కింద ఈ మెడికల్ కళాశాల, ఆసుపత్రి నిర్మాణం కోసం రూ.312 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. అనివార్య కారణాల వల్ల పనులు నత్తనడక నడుస్తుండడం వల్ల ఇప్పటివరకు 60 శాతం పనులే పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన 40 శాతం పనులు త్వరగా పూర్తి కావడానికి ప్రభుత్వం చొరవ చూపి సకాలంలో పూర్తి చేయాలన్నారు. అలాగే ఇప్పటివరకు జరిగిన పనులను స్థానిక అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.సుబ్బారెడ్డి, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ ఎం.కేశవయ్యతో కలిసి పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వీరి వెంట మెడికల్ కాలేజ్, ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.



ఆసుపత్రి భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న నాబార్డు ప్రతినిధులు

కేవీకే సందర్శన

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సోమవారం నాబార్డ్ జనరల్ మేనేజర్ కేవీఎస్. ప్రసాద్, ఏజీఎం. సుబ్బారెడ్డి సందర్శించారు. కేవీకేలో అమలు చేస్తున్న విధానాలను, తేనె బుట్టలు, షెడ్ నెట్స్, వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీ, ఇతర విధానాలను నాబార్డ్ ప్రతినిధులకు కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్రచౌదరి వివరించారు. వర్షాధార సమీకృత వ్యవసాయ విధాన ప్రాజెక్ట్‌ను కేవీకేకు మంజూరు చేయాలని నాబార్డ్ ప్రతినిధులకు వినతిపత్రం అందజేశారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ నిరంజన్‌రెడ్డి, మౌనిక తదితరులు ఉన్నారు.

అన్నపై తమ్ముడి దాడి

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలోని చాకలి వీధికి చెందిన చాకలి కృష్ణ పై అతని తమ్ముడు చాకలి ఈరన్న రాళ్లతో దాడి చేసి గాయపరిచినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు చాకలి కృష్ణ, చాకలి ఈరన్నలు అన్నదమ్ములు అయితే వీరికి స్థలంలో విషయంలో గత కొంత కాలంగా మనస్పర్ధలు ఉన్నాయి. ఆ స్థలం విషయంలో సోమవారం ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఇద్దరి మధ్య వాదోపవాదాలు తీవ్రస్థాయికి చేరాయి. ఆగ్రహానికి లోనైన ఈరన్న, కృష్ణపై రాళ్లతో దాడి చేశాడు. దీంతో కృష్ణ తలకు గాయమైంది. గాయపడిన కృష్ణను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆస్పత్రి తరలించారు. బాధితుడు కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గోనెగండ్ల : మండల పరిధిలోని తిప్పనూరు బ్రిడ్జి వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ విజయ భాస్కర్ తెలిపిన వివరాల మేరకు తిప్పనూరు గ్రామానికి చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా తిప్పనూరు బ్రిడ్జి వద్ద నుంచి ఇసుకను అక్రమంగా వేరే ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముకుంటున్నాడన్నారు. అందిన సమాచారం మేరకు సోమవారం ఉదయం వెళ్లి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకొని, అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

మంత్రాలయం: ప్రజా సమస్యలను పరిష్కరించడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా నాయకులు అంజి బాబు, మండల కార్యదర్శి జయరాజు విమర్శించారు. సోమవారం మంత్రాలయంలో అంబేడ్కర్ సర్కిల్ నుంచి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను వెంట నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ రవికి అందజేశారు. పెద్దకడబూరు మండల కార్యదర్శి తిక్కన్న, కార్యకర్తలు లక్ష్మన్న, అనిల్, ప్రాణేష్, అంజి, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలి

ఆదోని రూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేష్ డిమాండ్ చేశారు.. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. బి.వీరారెడ్డి, డి.రామాంజనేయులు, ఉచ్చీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేసేదెన్నడని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు రాజు, ప్రసాద్, ఏసేపు ప్రశ్నించారు. సోమవారం తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం ఇచ్చి మాట్లాడారు.



మంత్రాలయంలో తహసీల్దార్ రవికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

నందవరం : ముగతి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సోమేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం నాయకులు గ్రామంలో నిరసన చేపట్టారు. ట్యాంకుల వద్ద మురుగు నీరు తొలగించి, తాగు నీటి కుళాయిలకు బీరడాలు బిగించాలని కోరారు. రమేష్, తిప్పన్న, గోవర్ధన్, ఉరుకుందు, వీరారెడ్డి, లక్ష్మన్న పాల్గొన్నారు.

హామీలను నేరవేర్చాలి

గోనెగండ్ల: ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గోనెగండ్లలో సీపీఎం మండల కార్యదర్శి కరుణాకర్ అధ్యక్షతన ప్రజా చైతన్య యాత్ర చేపట్టారు. నబిరసూల్, మునెప్ప, బతకన్న, దేవదాసు, లింగన్న పాల్గొన్నారు.



ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, వైద్య సిబ్బంది,



ఎమ్మిగనూరు ఏరియా హాస్పిటల్లో డాక్టర్ సుధా ఆధ్వర్యం ర్యాలీ నిర్వహిస్తున్న, వైద్యులు, సిబ్బంది

టీబీ మహమ్మారిని నిర్మూలిద్దాం

ఆదోని టౌన్: టీబీ మహమ్మారిని నిర్మూలిద్దామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి పిలుపునిచ్చారు. టీబీడే సందర్భంగా సోమవారం ఆదోని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, డాక్టర్ షేకున్‌బాను, ఎస్‌పీఎం డాక్టర్ వందన, టీబీ స్టాఫ్, ఆశావర్కర్లు, నేషనల్ నర్సింగ్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఎక్కువ రోజులు దగ్గు, గల్లలో రక్తం పడితే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో గల్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. అనంతరం పీఎంటీబీఏ కార్యక్రమం ద్వారా పేద క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను మధు ఆసుపత్రి వారి సౌజన్యంతో డాక్టర్ మనీషా చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నిరంజన్‌కుమార్, ఫయాజుద్దీన్, టీబీ స్టాఫ్ ఎస్‌టీఎస్ స్వరూప్‌రాజ్‌కుమార్, ఎస్‌టీఎల్ఎస్ భాస్కర్ పాల్గొన్నారు.

ఆదోని అర్బన్: స్థానిక ఆదిత్య నర్సింగ్‌హోం ఆవరణలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఆదోని శాఖ ఆధ్వర్యంలో ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ కృష్ణమూర్తి, సెంట్రల్ వర్కింగ్ మెంబర్లు డా.గోపీనాథ్‌లు ప్రజలకు టీబీ నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఎంఏ మెంబర్లు డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ ఆదిత్యకుమార్, డాక్టర్ వసుధరాణి పాల్గొన్నారు.

కోసిగి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి మౌనిక, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లుతో కలిసి ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేపట్టారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారిణి ఈశ్వరమ్మ, ఎంపీహెచ్‌ఈఓలు ఎల్లప్ప, శ్రీనివాసులు, పబ్లిక్ హెల్త్ నర్స్ వి. కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మందులతో క్షయను నయం చేయొచ్చు

ఎమ్మిగనూరురూరల్: క్షయ వ్యాధిని క్రమం తప్పకుండా మందులు వాడితే నయం చేయవచ్చునని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధా అన్నారు. సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని దైవందిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ అపర్ణ, ల్యాబ్ టెక్నీషియన్ శివరామిరెడ్డి, సూపర్‌వైజర్ సురేష్, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

నందవరం : క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నందవరం పీహెచ్‌సీ డాక్టర్లు శ్రీలేఖ, రేవతి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న న్యాయవాదులు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పి.రషీదుల్లా, ఉపాధ్యక్షుడిగా పి.నాగన్న, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఆనంద్, సహాయకార్యదర్శిగా ఎం.హిజికియా, లైబ్రెరీ సెక్రటరీగా కె.ఎంకన్న, కోశాధికారిగా మురళీకృష్ణ, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా వి.రామకృష్ణను ఎన్నుకున్నారు. ఎన్నికల కమిటీ సభ్యులుగా రంగనాథ్, కుమార లింగమూర్తి ,రామకృష్ణ వ్యవహరించారు. నూతన అసోసియేషన్ కార్యవర్గ సభ్యులను న్యాయవాదులు సత్కరించారు.

డెంగీ కేసుపై విచారణ

నందవరం : మండల పరిధిలోని పూలచింత గ్రామంలో డెంగీ కేసుపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీలేఖ సోమవారం విచారణ చేపట్టారు. గ్రామంలో 9 నెలల చిన్నారికి డెంగీ నిర్ధారణ కాగా.. తల్లిదండ్రులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీకెళ్లారు. అక్కడ చికిత్స పొంది కోలుకున్నాడు. ఆదివారం పూలచింత గ్రామానికి చెరుకున్నారు. దీంతో డాక్టర్ శ్రీలేఖ గ్రామానికి వెళ్లి డెంగీ కేసుపై విచారణ చేశారు. ఆమె మాట్లాడుతూ..చిన్నారి పూర్తిగా కోలుకున్నాడని, ఆసుపత్రి నుంచి రావడంతో వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు.

ఆర్డీఎస్ కుడి కాలువ సాధన దీక్షకు వైఎస్సార్‌సీపీ మద్దతు

ఎమ్మిగనూరుటౌన్: జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో బీడుబారిన భూముల్లో వ్యవసాయానికి ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణం తప్పనిసరి అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నజీర్‌అహమ్మద్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంకే శివకుమార్ అన్నారు. పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఆర్డీఎస్ కుడి కాలువ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్ష సోమవారానికి రెండో రోజుకు చేరుకుంది. దీక్షలో కుర్చున్న వారికి వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్పతో కలిసి మద్దతు ఇచ్చి మాట్లాడారు. రైతుల హక్కుల సాధనకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందన్నారు. ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణంపై కూటమి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకొకపోవడం శోచనీయమన్నారు. ఆర్డీఎస్ కుడి కాలువ లేకపోవడంతో ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో సాగునీటికి ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఎస్ కుడి కాలువా సాధన సమితి నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా దీక్షలకు భారత రైతు కూలీ సంఘం నాయకులు ఏసేపు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి హనీఫ్ సంఘీభావం తెలిపారు.



రిలే దీక్షలకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెన్షనర్ల సామాజిక సేవ

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సామాజిక సేవలు చేయడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్ సమీపంలో ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడు తూ ఇలాంటి సేవాకార్యక్రమాలకు ఎల్లప్పుడు తా ము ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఏపీ వీరన్న, శ్రీనివాసులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

డంప్ యార్డ్ పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సోగనూరు రోడ్డు లోని చెత్త డంప్ యార్డ్‌ను సోమవారం మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఏఎస్‌డీ ఖాజాహుసేన్‌తో పాటు మరికొందరు అధికారులు సోమవారం పరిశీలించారు. డంప్‌యార్డ్ గురించి మున్సిపల్ డీఈ రాజునాయక్, ఏఈ మదన్‌ను ఆయన అడిగి తెలుసుకున్నారు. కాగా డంప్‌యార్డ్ ద్వారా సమీపంలో నివసిస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న ఆయన దృష్టికి తీసుకెళ్లారు.



డంప్ యార్డ్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఓఎస్‌డీ

టీబీ సూపర్‌వైజర్ బాబురాజుకు పురస్కారం



జిల్లా అధికారుల చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న టీబీ సూపర్‌వైజర్ బాబురాజు, ల్యాబ్ టెక్నీషియన్ పద్మావతి

ఆదోని సెంట్రల్: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆడిటోరియంలో సోమవారం అంతర్జాతీయ టీబీ దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఇందులో ఉత్తమ సేవా పురస్కారాన్ని టీబీ సూపర్‌వైజర్ బాబురాజుకు జిల్లా అధికారులు అందజేశారు. అలాగే పద్మావతికి ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా అవార్డును డీఎంహెచ్ డాక్టర్ శాంతికళ, డీఎల్‌టీవో డా.భాస్కర్ చేతులమీదుగా అందుకున్నారు.